# పెళ్ళిచూపులు

**హౌ**రా స్టేషన్ రద్దీగా ఉంది. పన్నెండో నంబర్ ప్లాట్‌ఫారమ్ అంతా సందడిగా వుంది. సామాన్లు దగ్గర పెట్టుకుని నిలబడి మాటి మాటికీ వంగి రైలు పట్టాల వంక చూస్తూ ఉన్నారు జనం. హఠాత్తుగా దూరంగా చుక్, చుక్ మంటూ కనిపించింది ఇంజను. బండి వస్తూంది అనే కేకలు రకరకాల భాషల్లో వినిపించాయి. హడావిడిగా లేచారు కూర్చున్న వాళ్లు. రిజర్వేషన్ లేని వాళ్ళు, జనరల్ కంపార్ట్‌మెంట్‌లో ఎక్కాల్సిన వాళ్ళు బండికి ఎదురు పరిగెట్టారు. కూలీలు గబగబ వచ్చి సామాన్లు నెత్తి కెత్తుకున్నారు. రెండు నిమిషాల్లో మెల్లగా వచ్చి కీచుమంటూ ఆగింది మద్రాసు వెళ్ళాల్సిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్.

మరో పది నిమిషాలకి తాపీగా వచ్చారు నల్లకోట్ల టి.సి.లు. రిజర్వేషన్ చార్టులు తెచ్చి కంపార్టు మెంట్‌లకి అంటించారు. వెంటనే జనం ఆ ఛార్ట్‌ల చుట్టూ ఈగల్లా మూగారు. జనంలోనించి తన బుర్ర బయటికి లాక్కున్నాడు మజుందార్. గబగబ నడుస్తూ దూరంగా ఉన్న పంజాబి డ్రెస్ అమ్మాయి దగ్గరకు వెళ్ళి “ఛలో, బేటియా! బి–కంపార్ట్‌మెంట్” అన్నాడు. పక్కనే నిలబడిన పదిహేనేళ్ళ అబ్బాయి “చలూన్, కాకా!” అంటూ సామాన్లు తీసుకోవడంలో కూలీకి సాయం చేసే వాటర్ బాటిల్ భుజాన తగిలించుకున్నాడు. అందరూ కంపార్ట్‌మెంట్ వైపు నడిచారు.

లోపలికి వెళ్ళి వెళ్ళగానే చేతిలోని వానిటి బాగ్ పై బెర్త్ మీదికి విసెరేసి కటికీకి అనుకుని చేతిలోని ట్రాన్సిస్టర్‌కి చెవి అనించి వింటూ కూర్చుంది ఆ పంజాబి డ్రెస్ అమ్మాయి. కూలీ చేత సామాన్లు సర్దించి, వాడికి డబ్బులు ఇచ్చి పంపించి, “చలో, బాబా! బాహర్ ఖడే హోతేహే” అంటూ ఆ కుర్రాడిని వెంటబెట్టుకుని రైల్లోంచి దిగి ఫ్లాట్‌ఫారమ్ మీద నిలబడ్డాడు మజుందార్.

నల్లటి పాంటుమీద క్రీమ్ కలర్ షర్ట్ వేసుకున్న యువకుడు 'బి' కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చాడు. ఒక్కక్షణం ఆ అమ్మాయి వంక చూశాడు. ఆ దర్జా చూస్తే అతనికి అనుమానం వచ్చింది. మళ్ళీ వెళ్ళి మరోసారి ఛార్ట్ చూసుకుని వచ్చాడు. మెల్లిగా వెళ్ళి ఆ అమ్మాయి దగ్గరగా నిలబడి "ఎక్స్‌క్యూజ్ మీ" అన్నాడు.

"ఒన్ సెవెంటిఫోర్ ఫర్ ఫోర్" అంది ఆ అమ్మాయి రేడియో వింటూనే. ఒక్క క్షణం ఆగి మళ్ళీ "ఎక్స్‌క్యూజ్ మీ, మేడమ్" అన్నాడు. "ఒన్ సెవెంటీ ఫైవ్ ఫర్ ఫోర్" అంది తలెత్తకుండా. ఉసూరుమంటూ "ఎక్స్‌క్యూజ్ మీ" అన్నాడు కాస్త గట్టిగా. చివాల్న తలెత్తింది ఆ అమ్మాయి. "ఓహ్! యూ పీ ఫుల్! వై కాంట్ యూ కారీ యువర్ ఓన్ ట్రాన్సిస్టర్? బార్ బార్ స్కోర్ పూఛ్‌తే రెహేతేహై. దూస్‌రోంకో పరిషాన్ కర్తేహై! కెహే రహీహూ నా! ఒన్ సెవెంటీ సెవెన్ ఫర్ ఫోర్" అది విసుగ్గా, చిరాకు వేసింది అతనికి.

"గో టు హెల్ విత్ యువర్ కామెంట్రీ. దిసిజ్‌మై సీట్. విల్ యూ ప్లీజ్ గెటప్" అని అరిచాడు. "ఓ! అయామ్ సారీ" అంటూ లేచి ఎదురుగా ఉన్న బెర్త్ మీద కూర్చుంది ఆ అమ్మాయి. "ఓహ్" అంటూ ఏదో సణుక్కుని తన లగేజ్ సర్దుకుని సీట్‌మీద కూర్చున్నాడు అతను. బూట్లు విప్పి సీట్ కిందకి నెట్టేసి వెనక్కి చేరబడి కూర్చున్నాడు.

ప్లాట్‌ఫారమ్‌మీద నిలబడి దూరంగా వస్తున్న జనంలోకి చూస్తున్న మజుందార్ లేత నీలం సఫారీ సూట్, గోల్డ్ ఫ్రేమ్ కళ్ళద్దాలు, బట్టతలతో వస్తున్న రావుగార్ని చూడగానే "సాబ్, ఆశ్చేన్" అంటూ ఆ పేంటు పైకి లాక్కుంటూ ఎదురు వెళ్ళాడు. మరో నిమిషంలో కంపార్ట్‌మెంట్ దగ్గరికి వచ్చారు రావుగారు. "డాడీ!" అంటూ ఎదురు వెళ్ళిన కొడుకు భుజం తట్టి హల్లో, శరత్. జాగర్తగా వచ్చారా? ట్రాఫిక్ జామ్ అవలేదుగా!" అని అడిగారు ఆదరంగా. అతని సమాధానం వింటూ కంపార్ట్‌మెంట్‌లోకి నడిచారు. తండ్రిని చూసీ చూడగానే "డాడీ, గవాస్కర్ ఈజ్ ఔట్ ఫర్‌నైన్టీఫైవ్" అంది మంజు ఏడుపు గొంతుతో. "టేకిట్ ఈజీ, బేటీ!" అంటూ కూతురు చేతిలో నుంచి ట్రాన్సిస్టర్ తీసుకుని ఆపేసి పక్కన పెట్టేశారు. కూతురి పక్కనే కూర్చుని మాట మార్చి నవ్వించారు.

"చూడు తల్లీ, పెళ్ళిచూపుల్లో అతన్ని జాగర్తగా చూడు. తాతగారి కోసమో, అమ్మ బాధపడుతుందనో ఆలోచించకు. నీ ఇష్టం అయితేనే పెళ్ళి అయ్యేది. నీ నిర్ణయం ఫైనల్. నేను పూర్తిగా నిన్నే సపోర్ట్ చేస్తాను" అన్నారు.

"పోండి, డాడీ, మీ రెప్పుడూ ఇంతే. ముందేమో నన్ను సపోర్ట్ చేస్తానంటారు. తీరా అమ్మ ఏదో చెప్పేసరికి ఎస్ ఎస్ నిజమే అంటూ ఒప్పుకుంటారు" అంది మంజు బుంగమూతి పెట్టి. బట్టతల సవరించుకుంటూ నవ్వారు రావుగారు.

"నిజమేనమ్మా. మా ఛెయిర్మన్ మాటయినా ధైర్యంగా కాదంటాను. కానీ, మీ అమ్మ మాట కాదనలేను. ఇదే నా ఏకైక బలహీనత" అన్నారు. శరత్, మంజు ఫక్కున నవ్వేశారు. ఆ మాటలు అర్థం కాకపోయిన 'ఇహిహి' అంటూ నవ్వాడు మంజుందార్.

వీళ్ళు మాట్లాడుకుంటూ ఉండగానే టైమ్ అయిపోయింది. కంపార్ట్మెంట్‌లో నించి కిందికి దిగారు రావుగారు, మజుందార్. "డాడీ! అమ్మతో ఏం చెప్పను!" అడిగాడు శరత్. "టెల్ హర్ దట్ ఐ మిస్ హర్ వెరీ మచ్. త్వరగా వచ్చెయ్యండి. మీరు లేకపోతే నాకేం బాగుండదు" అన్నారు రావుగారు.

రైలు కూసింది. "ఉంటాను, నాన్నా, మరి. జాగర్తగా వెళ్ళండి. వెళ్ళగానే టెలిగ్రామ్ ఇప్పించండి. మంజూ, జాగర్తమ్మా!" అంటూ హడావిడి పడిపోయారాయన. "అలాగే, డాడీ! వెళ్ళొస్తాం. మీకు సెలవు దొరికితే మీరు రండి" అంది మంజు కిటికి దగ్గర వంగి నిలబడి. రైలు కదిలింది. "వెళ్ళొస్తాం, డాడీ, బై, కాకూ" అంటూ చెయ్యి ఊపాడు శరత్. వాళ్ళు కనిపించినంత సేపు చెయ్యి ఊపి ఇద్దరూ లోపలికి వచ్చి కూర్చున్నారు.

టి.సి. వచ్చి టికెట్లు చెక్ చేశాడు. ఆ మిగిలిపోయిన నాలుగో బెర్త్ మరొక ప్రయాణీకుడికి ఇచ్చాడు. అతనొక ముసలివాడు. పంజాబి, వెంటనే డ్రెస్ మార్చుకుని నాలుగు అరటిపళ్ళు తినేసి "జై మాతాదీ" అంటూ పైబెర్త్ మీదికి ఎక్కి పడుకున్నాడు. అక్కా తమ్ముళ్ళు కాసేపు కబుర్లు చెప్పుకున్నారు. కాసేపు మాగజైన్లు చదువుకున్నారు. ఇద్దరికీ బోర్‌గా వుంది. టీ తరువాత వర్షం వల్ల ఆట ఆగిపోవడం చేత కామెంట్రీ కూడా లేదు. "అక్కా మన ఎదురుగా ఉన్న ప్రాణి బకారపు వాడంటావా? (బెంగాలీ)" అని అడిగాడు శరత్. ఓరకంట చూసి "కాదురా! ఉత్తరప్రదేశానికి చెందిన వాడనుకొంటాను" అది మంజుల. "కాసేపు ఏడిపిద్దామా!" మళ్ళీ అడిగాడు. "ఓ.కే" అంది మంజుల గుసగుసగా.

రావుగారు కలకత్తాలో ఒక కంపెనీలో పెద్ద ఉద్యోగంలో ఉన్నారు. ఆయన భార్య రాజ్యలక్ష్మి. వారి సంతానం మంజుల, శరత్‌లు. రాజ్యలక్ష్మి మహా ఖచ్చితం

మనిషి. పిల్లలని మంచి క్రమశిక్షణలో పెంచింది. తెలుగు దేశానికి దూరంగా వచ్చేసినా ఇంట్లో పద్ధతులు ఏమాత్రం మారకుండా జాగ్రత్త పడింది. ఇంట్లో ఉన్నంత సేపు విధిగా తెలుగు మాట్లాడాల్సిందే. మరో భాష వినిపించిందో అక్షింతలు వేసేస్తుంది. పిల్లలని ఒంటరిగా ఎక్కడికీ పంపదు. అల్లరి చెయ్యనివ్వదు. తల్లి అదుపాజ్ఞలలో బుద్ధిగా పెరిగి పెద్దవాళ్ళయ్యారు పిల్లలు. మంజుల బి.ఏ. పూర్తి చేసింది. శరత్ పై ఏడు డిగ్రీ కోర్సుకి వస్తాడు. బి.ఏ. పూర్తి కాగానే ఎమ్.ఏ.లో చేర్పించి పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించింది రాజ్యలక్ష్మి. "చదువుకుంటూ ఉంటుంది. మంచి సంబంధం కుదిరితే పెళ్ళి చేసేయొచ్చు" అని ఆవిడ ఉద్దేశం. రావుగారి సొంత ఊరు విజయవాడ. మంజుల పెళ్ళి సంబంధాల వేట మొదలు పెట్టారు రావుగారి తండ్రి.

పదిహేను రోజుల కిందట కొడుకుని, కోడలిని రమ్మని ఉత్తరం రాశారు. రావుగారికి వీలు అవకపోవడం వల్ల రాజ్యలక్ష్మి ఒక్కతే వెళ్ళింది. వెళ్ళిన మరునాడే పిల్లల్ని తీసుకురమ్మని ట్రంక్ కాల్ చేసింది. మళ్ళీ తనకు తీరక, పిల్లలిద్దర్నీ ప్రయాణం చేయించారు రావుగారు. వస్తుతా మంజుల మహా ఆకతాయి. అక్కకు తగ్గ తమ్ముడు శరత్. "ఏమిటా అల్లరి! ఏళ్ళు వస్తున్న కొద్దీ గాడిదల్లా తయారవుతున్నారు. నోరు మూసుకుని కూర్చోండి" అని మాటి మాటికీ కసిరే మమ్మీ, ఆవిడకి ఎదురు చెప్పలేక "ఎస్, ఎస్. ఏమిటా అల్లరి" అని మెత్తగా మందలించే డాడీ ఎదురుగా లేకపోయేసరికి అల్లరి చెయ్యాలనిపించింది వాళ్ళకి. ఎదురుగా దొరికిన మనిషిని కాసేపు ఏడిపించాలనిపించింది. ఇద్దరూ ఏకమై అల్లరికి దిగారు.

"ఎక్స్‌క్యూజ్ మీ! నేనీ 'ఫిలిమ్‌ఫేర్' తీసుకోనా?" అంటూ ఇంగ్లీషులో పలకరించాడు శరత్? "ష్యూర్" అంటూ వెంటనే అందించాడు ఆ యువకుడు. "ఐయామ్ శరత్? షి ఈజ్ మై సిస్టర్ మంజుల" అంటూ పరిచయం చేసుకున్నాడు "ప్లీజ్ టు మీట్ యూ" అంటూ శరత్‌కి చెయ్యి అందించి మంజులకి నమస్కారం చేశాడతను. చిరునవ్వుతో ప్రతినమస్కారం చేసింది మంజు. "ఐయామ్ టాడా. ఆర్.కె.ఎమ్.టాడా" అంటూ పరిచయం చేసుకున్నాడు. "టాడా అట్లకాడా" అంది మంజు. శరత్‌కి నవ్వు ముంచుకొచ్చింది. కానీ నవ్వలేదు.

ఎదుటివారిని వాళ్ళకి తెలీని భాషలో ఏడిపించేటప్పుడు నవ్వకూడదు. ముఖంలో ఏ భావమూ కనిపించకుండా జాగర్త పడాలి. ఇవన్నీ, ప్రాక్టీసులో అలవడే విద్యలు. ఈ అక్కా తమ్ముళ్ళు ఆ విద్యలో ఉద్ధండ పండితులు. "వాట్! వాట్ డూయూ సే?" అన్నాడు టాడా! "ఏం లేదు. అట్లకాడా అంటే మా బాషలో 'వెరీగుడ్' అని అర్థం"

చిలకలా ఇంగ్లీషులో చెప్పింది మంజు. "ఓ! థ్యాంక్యూ, థ్యాంక్యూ" అంటూ ఆనందపడిపోయాడు టాడా. ఇక సంభాషణ హిందీలోకి దిగింది. "ఈ టెస్ట్‌లో ఇండియా ష్యూర్‌గా ఓడిపోతుంది. వెస్టిండీస్ వాళ్ళు మనని చావ చితక్కొట్టేస్తారు" అన్నాడు టాడా.

"నీ లాటి ఏడుపుగొట్టు ముఖాలు ఇలా అపశకునాలు పలుకుతుంటే ఓడక ఏం చేస్తుంది?" అని తెలుగులో తిట్టింది మంజు. వీళ్ళిలా మాట్లాడుకుంటూ ఉండగానే కాఫీ వచ్చింది. చివాల్న లేచి మూడు కప్పులు తీసుకుంది మంజు. డబ్బు లివ్వబోయిన టాడాని వారించి తనే డబ్బు లిచ్చింది. అంతేకాదు. ఎయిర్ బాగ్‌లోనించి బిస్కెట్ పాకెట్. చిప్స్ పాకెట్ తీసింది. ఇదంతా చూసి "ఏమిటక్కా? అతనికి ఇంత మర్యాద చేస్తున్నావేమిటి?" అని అడిగాడు శరత్. "మర్యాదా లేదు మట్టిగడ్డా లేదు. చూస్తూ ఉండు" అని కసిరింది మంజు.

బిస్కెట్లు చిప్స్ అతని ఎదురుగా పెట్టి "ఊఁ మింగు" అంది ఆదరంగా. "థ్యాంక్యు" అంటూ అందుకున్నాడతను. కాఫీలు అయ్యాయి. మళ్ళీ కబుర్లలో పడ్డారు. కాడ్‌బరీ చాక్లెట్ల వాడొచ్చాడు. వాడిని పిల్చి ఫైవ్‌స్టార్ బార్లు కొంది మంజు. హాండ్‌బాగ్ అందుకుంటూ ఉండగానే వారించి తనే డబ్బు లిచ్చాడు టాడా. 'ఎందుకూ మీ రివ్వడం' అని మొహమాట పడింది చాక్లెట్ తింటూ. ఆ తరవాత వెజిటబుల్ కట్లెట్లు, గోల్డ్ స్పాట్‌లు కూడా కొనేసి అతని చేతే డబ్బు లిప్పించింది మంజుల. "ఇక చాల్లే, అక్కా పాపం! ముఖం మాడిపోతోంది" అన్నాడు శరత్. "మరేం ఫరవాలేదు – ఇందాక భుజాలెగరేసుకుంటూ కాఫీ తాగలేదూ!" అంది మంజు. యథాశక్తి ఏడిపించుకు తిన్నారు పాపం అతన్ని.

ఆ పూట గడిచిపోయింది. తెల్లవారింది. వాల్టేర్ స్టేషన్ వచ్చింది. "నేను బ్రేక్‌ఫాస్ట్ చేసొస్తా. నాకు ఇటలీ అంటే చాలా ఇష్టం" అన్నాడు టాడా. "అలాగే – ఇటలీ ఏం కర్మ? పారిస్, జపాన్, లండన్, అన్నీ కలిసితినేసిరా" అంది మంజు మెల్లిగా. వెళ్ళి టిఫిన్ చేసి వచ్చాడు టాడా. "ఎక్సలెంట్. ఇటలీ, దోస రెండూ బ్రహ్మాండంగా ఉన్నాయి. ఈ ఇటలీలు ఎలా చేస్తారో!" అన్నాడు ఆనందంగా. "నాకు తెలిదండీ!" అన్నాడు శరత్ మర్యాదగా.

"ఏం లేదు. సగం రవ్వా, సగం పిండి కలిపి ఉప్పేసి నీ బుర్రమీద బోర్లిస్తే ఇటలీలు వచ్చేస్తాయి" అంది మంజు పుస్తకం చాటునించి. ముంచుకొచ్చిన నవ్వును అతి కష్టం మీద ఆపుకున్నాడు శరత్.

"ఏమిటి? ఏమిటంటున్నారు ఆవిడ?" ఆరా తీశాడు టాడా!

"అబ్బే ఏం లేదు. ఇట్లీలు తనకీ చాలా ఇష్టం. ఆ మాటే చెప్తోంది" అన్నాడు శరత్. "ఓ.." అని ఆనందపడ్డాడు టాడా.

ఇంతలో పైనించి పంజాబి అతను దిగాడు. ముఖం కడుక్కుని బ్రేక్ ఫాస్ట్ తినేసి జైమాతాదీ అంటూ మళ్ళీ పైకి వెళ్ళి పడుకున్నాడు. "ఇక మీ జర్నీ అయిపోయింది. ఇంకాసేపట్లో దిగిపోతారు" అన్నాడు శరత్.

"అవును. అందులోనూ రాజమెండ్రి వెళ్ళటం ఇదే మొదటిసారి. మావాళ్ళెవరైనా వస్తే పరవాలేదు. లేకపోతే కష్టమే. అసలే నాకు టెల్గూ రాదు" అన్నాడు టాడా దీనంగా.

"మరేం ఫర్వాలేదు లెండి. టాక్సీ వాళ్ళకి, ఆటోలవాళ్లకి హిందీలో చెప్తే తిన్నగా తీసుకెళ్ళి గోదావర్లో దించేస్తారు" అంది మంజు.

"ఏమిటీ!" ఆరా తీశాడు టాడా.

"రాజమండ్రిలో గోదావరి చాలా బాగుంటుంది. మిమ్మల్ని తప్పకుండా చూడమని చెప్పమంటోంది మా సిస్టర్" అన్నాడు శరత్.

"థ్యాంక్యూ - థ్యాంక్యూ... ఐ విల్ డెఫినెట్లీ సీ" హామీ ఇచ్చాడు టాడా. కడియం దాటింది రైలు. "చాలా సరదాగా గడిచింది ప్రయాణం. మీతో పరిచయం నాకు చాలా ఆనందదాయకంగా గడిచింది. మళ్ళీ ఎప్పుడైనా కలుసుకుంటే బాగుండు" అన్నాడు టాడా.

"ఆ మాట మేము చెప్పాలి. మీ వల్ల ఎంతో బాగా గడిచింది మాకు" అంది మంజు సిన్సియర్‌గా.

"థ్యాంక్స్" అన్నాడు టాడా ఆనందంగా.

రాజమండ్రి పొలిమేర్లల్లోకి ప్రవేశించింది రైలు. లేచి నిలబడ్డాడు టాడా. ఈ సందడికి లేచాడు ఆ పంజాబి. "వెళ్లిపోతున్నావు!" అని ప్రశ్నించాడు పంజాబిలో.

"అవును" అన్నాడు టాడా పంజాబి బాషలోనే. ఇద్దరూ ఏదో కీసర బాసరమని ఆ భాషలోనే మాట్లాడుకున్నారు. స్టేషన్‌లో ఆగింది రైలు.

"మీ వాళ్ళు వచ్చారేమో చూడండి" అన్నాడు శరత్? అదేమీ వినిపంచుకోకుండా కిటికీ దగ్గరికి వెళ్ళి చప్పట్లు చరిచి "ఏయ్, కూలీ" అని పిలిచాడు టాడా. కూలీ లోపలికి వచ్చాడు.

కిటికీ దగ్గర నిలబడి జామపళ్ళు బేరం చేస్తున్న మంజు. శరత్ పక్కన బాంబు పడ్డట్లు అదిరిపడ్డారు.

"ఏమిటీ? ఈ లగేజికి అయిదు రూపాయలా? ఏం కొత్తగా వచ్చావా రాజమండ్రికి? లేకపోతే నేను కొత్తవాణ్ణనుకున్నావా? రెండున్నరిస్తాను" అనర్గళంగా ఏమాత్రం కల్తీలేని తెలుగులో మాట్లాడుతున్నాడు టాడా. కళ్ళు గిర్రున తిరిగాయి వాళ్లకి. ఆ తరువాత ఏం జరిగిందో, ఎలా వచ్చి సీట్ మీద కూర్చున్నారో వాళ్ళకే తెలియదు. ధన ధనమనే మోతతో ఈ లోకంలోకి వచ్చారు.

గోదావరి బ్రిడ్జి మీద పోతోంది రైలు. ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. "నీకు బుద్ధి లేదు అంటే నీకు బుద్ధిలేదు" అని తిట్టుకున్నారు. 'అసలు మొదలుపెట్టింది నువ్వే అంటే కాదు నువ్వే' అని ఆరోపించుకున్నారు. "ఆ కాంపెక్షనూ అదీ చూసి తెలుగువాడు కాదేమో అనుకున్నాం. మనం తెలుగులో మాట్లాడటం విన్నాడు గదా! వెంటనే తనూ తెలుగువాడినని చెప్పద్దూ. యూస్‌లెస్ ఫెలో... ఇడియట్" అని అతణ్ణి తిట్టారు. 'మంచి పనే చేశాం' అనుకున్నారు. 'ఛ...ఛ... మరీ ఘోరంగా తిట్టేశాం' అని పశ్చాత్తాపపడ్డారు. "పోతే పోనిద్దూ' అతడేమైనా మన మేనత్త కొడుకా? ఎవరో ఏట్లో!!రామనాథం. తిడితే తిట్టాం లే" అంది మంజు ఇద్దరూ మాట్లాడకుండా కూర్చున్నారు.

నిర్ణీత సమయానికి గంట లేటు విజయవాడ చేరింది రైలు. స్టేషన్‌కి వాళ్ళ బాబాయి వచ్చాడు. ఇంటికి వెళ్లేసరికి వాకిట్లోనే ఎదురయింది తల్లి "ప్రయాణం బాగా జరిగిందా! నాన్నగారెలా ఉన్నారు?" అని ప్రశ్నలు వేసింది. బుద్ధిగా సమాధానాలు చెప్పారు ఇద్దరూ. విజయవాడలో బాగా టైమ్ పాస్ అయిపోతోంది. మంజులకి, బాబాయి కూతురు సునీతతో కలిసి బోలెడన్ని తెలుగు సినిమాలు చూసింది. హోటళ్ళూ, షికార్లూ చెప్పనే అక్కర్లేదు. నాలుగు రోజులు సరదాగా గడిచిపోయాయి. పెళ్ళివాళ్ళ దగ్గర్నుంచి కబురు వచ్చింది. 'మర్నాడు సాయంత్రం మూడింటికి వస్తున్నాం' అని కబురు పెట్టారు.

తెల్లారగానే ఇంట్లో హడావిడి మొదలైంది. మధ్యాహ్నం భోంచేసి హాయిగా నిద్రపోతున్న మంజు తల్లి వీపు మీద పెడీమని చరచడంతో ఉలిక్కిపడి లేచింది. "గంటనించి అరుస్తున్నాను. మొద్దు నిద్ర... ఇలా అయితే ఆ కట్టుకున్న వాడు బాగానే సుఖపడతాడు. అడ్డగాడిదా... లే!" అంటూ కసిరింది. చివాల్న లేచింది మంజు.

"ఎందుకమ్మా!" అంది గారంగా.

"ఎందుకేమిటే నీ తలకాయ! రెండైంది – లేచి తయారవు. స్నానం చేసిరా" అని పురమాయించింది ఆవిడ.

స్నానం చేసి రాగానే జుట్టు చిక్కుతీసి పొడవుగా ఒక్క జడ వేసింది. "అబ్బా! నేను రెండు జడలు వేసుకుంటానమ్మా!" అంది మంజు గారంగా.

"చాల్లే, ఊరుకో. ఇలా ఒక్క జడ వేసుకుంటేనో నిండుగా ఉంటావు. అబ్బాయితోబాటు అతని నాయనమ్మ కూడా వస్తోందట" అంది రాజ్యలక్ష్మి. జడవేసి పూలు పెట్టి, లేత గంధపురంగు కాశ్మీరు సిల్కుచీర తీసి "కట్టుకురా!" అని ఆర్డరు వేసింది. బుద్ధిగా చీర కట్టుకొచ్చింది మంజు. చెవులకు ముత్యాల జూకాలు, మెళ్ళో ముత్యాల నెక్లెసు అలంకరించింది. నుదురు మీద చిన్న గుండ్రని బొట్టు పెట్టింది. కూతుర్ని చూసి తృప్తిపడింది.

" బుద్ధిగా ఏ పుస్తకమో చదువుకుంటూ కూర్చో" అని చెప్పి హడావిడిగా వెళ్ళిపోయింది.

బుద్ధిగా కూర్చుంది మంజు. అంతలోనే గదిలోకి వచ్చాడు శరత్. జీన్స్, దానిమీద నైలాన్ టీ షర్టు వేసుకున్నాడు. "అక్కా! మై కైసా లగ్ రహాహు!" అనిఅడిగాడు.

"ఫైన్, యు ఆర్ లైక్ హీరో!" అంది మంజు. పక్కనున్న టేప్ రికార్డర్ పెట్టుకుని కాసేపు డాన్స్ చేశాడు. అంతలోనే వినిపించింది కిందినుండి కారు హారన్. డాన్స్ ఆపేసి "అక్కా, వాళ్ళొచ్చేసినట్లున్నారు. ఐ విల్ సీ ద గ్రూమ్ అండ్ గివ్ యూ రిపోర్ట్" అనేసి గదిలోనించి బయటికి పరిగెట్టాడు. లేచి అద్దం ముందు నిలబడి తన ప్రతిబింబాన్ని చూసుకుంటున్న మంజులకి రాకెట్‌లా దూసుకొస్తూ కనిపించాడు శరత్.

"ఏమిట్రా!" అంది ఆశ్చర్యంగా.

"అక్కా! మర్‌గయే. మర్‌గయే!" అన్నాడు రొప్పుతూ.

"ఏమిట్రా? ఎవరు చచ్చారు?" అంది అదుర్దాగా.

"మనం మరగయే. ఆ పెళ్ళికొడుకు ఎవరో కాదు మన టాడా" అన్నాడు.

"ఆః!" అంటూ నోరావలించి చేష్టలుడిగి మంచంమీద కూలబడింది. మంజు బుర్ర మెద్దుబారి పోయింది.

మరి కాసేపటికి తల్లి, బాబాయి పిన్ని ఆ గదిలోకి వచ్చారు. "మంజూ, పదమ్మా!" అంటూ చెయ్యి పట్టుకుంది రాజ్యలక్ష్మి! కెవ్వుమంటూ అరిచింది మంజు. "బాబోయ్! నేను రాను. రాలేను. నాకు తలనొప్పి. కాదు–కడుపు నొప్పి. అమ్మో! జ్వరం" అంటూ చెయ్యి విదిలించుకుని మంచానికి అడ్డంగా పడుకుంది.

అంతా కంగారుపడిపోయారు. "ఏమిటే–ఏమైంది? ఇప్పటిదాకా బాగానే ఉన్నావుగా!" ఆదుర్దాగా కూతురి పక్కన కూర్చుంది రాజ్యలక్ష్మి.

"అమ్మో! నాయనో!" అంటూ కేకలు తప్ప మాట్లాడలేకపోయింది మంజు.

"మన డాక్టర్ని పిలుస్తాను" అంటూ గుమ్మందాకా వెళ్ళిన బాబాయి వెనక్కి తిరిగాడు. "వదినా! ఆ పెళ్ళికొడుకు డాక్టరేగా!" ఓసారి వచ్చి చూడమంటే?" అన్నాడు.

కెవ్వున అరిచి స్ప్రింగులా లేచింది మంజు. "వద్దు, నాకే డాక్టరూ వద్దు. నేను!! బాగానే ఉన్నాను'' అంది మూలుగుతూనే. అంతా మొహమొహాలు చూసుకున్నారు. పిన్ని మంజుల దగ్గరకు వచ్చి నుదురు ముట్టుకుని చూసింది. "జ్వరం లేదర్రా! ఏది... వచ్చిన దగ్గర్నుంచీ ఒకటే తిరుగుడు. విశ్రాంతి లేదు. అందుకే కాస్త చికాకు చేసినట్లుంది. మీరు వెళ్ళండి నేను తీసుకొస్తాను. మంజుని" అని చెప్పింది. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

"పిన్నీ! నాకు ఒంట్లో బాగాలేదు. నేన్రాలేను. వాళ్ళని పొమ్మను'' అని బతిమాలింది మంజు.

"తప్పమ్మా, అది మర్యాద కాదు" అని మందలించింది పిన్ని.

"నాకు కళ్ళు మంట, కాళ్ళు నొప్పి" అని లక్షసాకులు పెట్టింది మంజు. వాటికి పంచదార నీళ్ళూ, నిమ్మకాయ నీళ్ళూ ఇచ్చి చిట్కా వైద్యం చేసేసింది పిన్ని. "ఇక పద, మంజూ. ఇప్పటికే బోలెడు ఆలస్యం అయింది" అంటూ మరోసారి మేకప్ సవరించింది. తల పైపైన దువ్వి చెయ్యి పట్టుకుని లేవదీసింది. 'విధా' కర్మమా అనుకుంటూ బలి పశువులా నడిచింది మంజుల మేడ దిగి హాల్లోకి వచ్చారు. తల భూమిలో వంచేసుకుని సోఫాలో తల్లి పక్కన కూర్చుంది.

"నీ పేరేమిటమ్మా!" ఆదరంగా అడిగింది పెళ్ళికొడుకు తల్లి.

"మ...మ....మ...మంజుల."

ఫకాల్న నవ్వి. "మీకు న...న...న...నత్తా?" అని అడిగాడు పెళ్ళికొడుకు మంటాడ రవికుమార్!

"చాల్లే–ఊరుకో. రవీ! ఏమిటా ఆటకాయితనం! ఎంత చదువున్నా ఆడపిల్ల ఆడపిల్లే. అసలైన ఆడపిల్లకి ఆ సిగ్గే సింగారం. ఆడపిల్లలు వినయంగా ఉంటేనే అందం. అదే మన సంప్రదాయం" అంది రవి నాయనమ్మ.

"బాగా చెప్పారమ్మా. మన ఇళ్ళలో పద్ధతి అదే అసలు. మా అబ్బాయి, కోడలూ కలకత్తాలో ఉన్నా.. అన్నీ మన పద్ధతులే పాటిస్తారు. మా అమ్మాయి అని చెప్పుకోవటం కాదు కానీ, మా మంజుల మహా బుద్ధిమంతురాలు. తన లోకం ఏమో, తనేమో, తల వంచుకుని కాలేజీకి వెళ్ళి మళ్ళీ తల వంచుకుని ఇంటికి వచ్చేస్తుంది. ఒకళ్ళ జోలికి పోదు. ఒకళ్లని ఒక మాట అనదు."

తాతగారి మాటలు వింటున్న మంజులకి చచ్చేంత మొహమాటం వేసింది. అప్రయత్నంగా తల ఎత్తి అతని వంక చూసింది. తాతగారి మాటలు వింటూ ఉంటే చెప్పలేనంత నవ్వు వచ్చింది రవికి. ఎదురు సీట్‌మీద కూర్చుని అల్లరి చేస్తున్న గులాబి రంగు పంజాబి డ్రెస్ అమ్మాయి కళ్ళ ముందు మెదిలింది అప్రయత్నంగా. అటు చూశాడు. తనవంకే చూస్తున్న మంజులనిచూసి వెక్కిరింతగా నవ్వి చిలిపిగా కన్ను కొట్టాడు. చివాల్న తల వంచుకొంది మంజుల. తాతగారి మాటలు శ్రద్ధగా వింటున్న పెద్దలు ఇది గమనించలేదు.

తాతగారు చెప్పాల్సింది అవగానే నాయనమ్మ మొదలుపెట్టింది. "మా అబ్బాయి అంతే బాబుగారూ! అంత చదువూ చదివినా ఈ కాలం వాళ్లలా పోకిరి వేషాలు లేవు" అంటూ మొదలు పెట్టి మనవడి గుణగణాలు వర్ణించింది. "రవీ! అమ్మాయిని నువ్వు ఏదైనా అడగాలంటే అడుగు" అన్నారు రవి తండ్రి. "ఆవిడతో నేను ఒంటరిగా మాట్లాడతాను" అన్నాడు రవి. మంజుల గుండె ఠారుమంది.

అబ్బాయి అమ్మాయితో మాట్లాడతాను అనగానే అందరూ లేచి అవతలికి వెళ్ళటం ఓల్డ్ ఫేషన్. మీ రిద్దరూ అలా వెళ్ళి రండి అనటం సరికొత్త పద్ధతి. అందుకే "మంజూ! రవిని మన మేడమీదికి తీసుకు వెళ్ళమ్మా అక్కడినించి కనకదుర్గ కొండ వ్యూ చాలా బాగుంటుంది" అన్నాడు బాబాయి. కదలకుండా కూర్చుంది మంజు. రెండు నిమిషాలు చూసి "మంజూ!లే" అంది తల్లి. మెల్లగా విధిలేక లేచి, తాతగారు చెప్పినట్లు బుద్ధిగా తల వంచుకుని నడిచింది మంజు, తనూ లేచి నాయనమ్మ చెప్పినట్లు పోకిరీ వేషాలు వెయ్యకుండా బుద్ధిగా వెంటబడ్డాడు రవి. రెండంతస్తు లెక్కి డాబామీదికి చేరారు ఇద్దరూ.

సాయంత్రం నాలుగయింది. శీతాకాలపు ఎండ ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. మెట్ల గది గోడకి అనుకొని తల వంచుకొని జడ కొనలు విప్పుతూ, అల్లుతూ నిలబడి అతనేం మాట్లాడతాడో అని చూస్తోంది మంజుల. పిట్టగోడకి అనుకొని నిలబడి కన్నార్పకుండా మంజులనే చూస్తున్నాడు రవి.

మంజులకి ఏనాడూ ఇటువంటి పరిస్థితి ఎదురవలేదు. రైల్లో చేసిన అల్లరి గుర్తొచ్చి మొహమాటంగా ఉంది. గభాల్న అక్కడినించి పారిపోవాలనిపించింది. ఎన్నడూ లేనిది భయంగా, బెరుకుగా, ఇంకేదోలా ఉంది. క్రమంగా ఆ భయం దూరమై పోయింది. "ఏడిపించింది నిజమే కానీ, అందులో అతని తప్పూ ఉంది. అతను మళ్ళీ ఇలా ఎదురౌతాడని తానేమైనా కలగందా? అసలామాటకి వస్తే ఇలా ఎంతో మందిని ఏడిపించింది తను" పెళ్ళికూతురి సంకోచం తొలగిపోగా మామూలు అల్లరి మంజులగా మారిపోయింది. తల ఎత్తి అతని వంక చూసింది సూటిగా తన వంకే చూస్తున్నాడు.

"అదుగో – అదీ కనకదుర్గ కొండ" అంటూ చూపించింది.

"బ్యూటిఫుల్" అన్నాడు తల తిప్పకుండా.

"అది గాంధీ హిల్" అంటూ మళ్ళీ దృష్టి మళ్ళించడానికి ప్రయత్నించింది.

"మార్వలెస్" అన్నాడు చిలిపిగా.

చిరాకు వేసింది మంజులకి.

"నే వెళ్తున్నా" అంటూ గిర్రున వెనక్కి తిరిగింది.

"ఆగండాగండి" కంగారుగా వారించాడు రవి. ఆగిపోయింది.

"నేను అడగాలనుకున్నది ఇంకా అడగలేదు" మంజులకి చేరువగా వస్తూ అన్నాడు.

"త్వరగా అడగండి" అంది వెనక్కి తిరగకుండానే.

"ఏం లేదు. మీ తాతగారు మీ రెంతో బుద్ధి మంతురాలని చెప్పారు కానీ, రైల్లో మీ ప్రవర్తన, మీ అల్లరి చూస్తే ఆ మాట అబద్ధం అనిపిస్తోంది. మరి..."

అతని మాట పూర్తి కాకుండానే చివాల్న వెనక్కి తిరిగింది మంజు. "ఓహో! మరి తమరి నాయనమ్మగారు తమ రెంతో బుద్ధిమంతులనీ, పోకిరీ వేషాలు వెయ్యరనీ

చెప్పారు. రైల్లో అంత నాటకం ఆడటం పోకిరీ వేషం కాక మర్యాదస్తుల లక్షణమా?" నిలదీసి అడిగింది. రోషంతో ఎర్రబడ్డ చెంపల వంక పరవశంగా చూశాడు రవి.

"స్వభావ సిద్ధంగా నేను మంచివాడినే. బుద్ధిమంతుడినే. కానీ, పెళ్ళి చూపుల్లో ఎదురవ్వాల్సిన పెళ్ళికూతురు హఠాత్తుగా రైల్లోనే కనిపించేసరికి పోకిరీ వేషాలు వెయ్యబుద్ధివేసింది" అన్నాడు.

ఆశ్చర్యంగా చూసింది మంజు. "అంటే, మీకు ముందే తెలుసా? ఎలా?"

"నాన్నగారు నాకు మీ వివరాలు అన్నీ రాశారు. హౌరాలో మీ మాటలవల్ల అంతా గ్రహించగలిగాను. నిజానికి నేనంత అమాయకుడినేం కాదు మీ రాడించినట్లూ ఆడడానికి. ఏదోలే ఎంతైనా కాబోయే భార్య, బావమరిది కదా అని మీ అల్లరంతా భరించి ఊరుకున్నాను" అన్నాడు.

గుండె దడదడలాడగా తల వంచేసుకుంది మంజు. పరవశంగా చూశాడు రవి.

"మంజూ! చూసీ చూడగానే నాకెంతో నచ్చావు నువ్వు. నీలా చిలిపిగా, చలాకీగా ఉండే అల్లరిపిల్లకోసమే ఎదురుచూస్తున్నాను. నేను. పెళ్ళికాగానే మనిద్దరం కలిసి అల్లరిచేస్తూ గడిపేద్దాం. నీకు తెలుసు కదా! నేను వుంటూంది డార్జిలింగ్‌లో. అక్కడ వాతావరణం చాలా బాగుంటుంది. కాంచన జంగ శిఖరం మనింట్లో నించి చక్కగా కనిపిస్తుంది. అసలు మనం కిటికీ దగ్గరికి కూడా వెళ్ళక్కర్లేదు. మన బెడ్‌రూమ్‌లో మంచంమీద కూర్చుని చూస్తే చాలు" మంజుల లేడిలా పరుగెత్తడంతో ఇహలోకంలోకి వచ్చాడు రవి.

"అరె... మంజు, ఆగు" అంటూ వెంటబడ్డాడు. మంజులకంటే ఒక్కడుగు ముందుగా వెళ్ళి మెట్లు దిగబోతున్న మంజులకి చేయి అడ్డుగా పెట్టి వారించాడు. సిగ్గుతో ముఖం ఎర్రబడిపోగా తల వంచుకుని నిలబడిపోయింది మంజు. పరవశత్వంనుండి పూర్తిగా బయటపడి "సారీ, మిస్ మంజూ, మీ అభిప్రాయం ఏమిటో తెలుసుకోకుండా ఏమిటో వాగేశాను. మన్నించండి. ఇప్పుడు చెప్పండి. మీ అభిప్రాయం ఏమిటి? నేను మీకు నచ్చానా? మీరు ఈ పెళ్ళికి ఒప్పుకుంటారా?" ఒక చెయ్యి సాచి రేలింగ్ మీద ఉంచి, ఒక కాలు మడిచి గోడకి ఆనించి మెట్టు చివర ఒంటికాలితో నిలబడి మాట్లాడుతున్న రవి కాలు హఠాత్తుగా స్లిప్ అయింది. ఒక్క క్షణం బాలన్స్ తప్పింది. నిలదొక్కుకోలేక పక్కకి తూలాడు. చేతికి పట్టుదొరకలేదు.

అతన్నే గమనిస్తున్న మంజు కంగారుగా మెట్టు దిగి అతని చెయ్యి గట్టిగా పట్టుకుంది. ఆ చేతిని పట్టుకుని నిలదొక్కుకున్నాడు రవి. రేలింగ్ పట్టుకుని పైకి వచ్చేశాడు. 'థాంక్ గాడ్' అంటూ రుమాలుతో నుదుటి మీది చెమట అద్దుకున్నాడు.

"ఇంకా నయం. ఒక్క క్షణం ఆలస్యం అయితే కిందికి దొర్లుకుంటూ వెళ్ళిపోయేవారు. ఏ కాలో విరిగి ఉండేది. అప్పుడు ఎంతమాత్రం మిమ్మల్ని పెళ్ళిచేసుకునే దాన్ని కాదు" అంది మంజు. సంభ్రమంగా చూశాడు రవి.

"ఇప్పుడు కాలు విరగలేదుగా! మరి ఇప్పుడు నన్ను పెళ్ళి చేసుకుంటావా!" ఆత్రుతగా అడిగాడు.

చిన్నగా నవ్వి తల దించుకుంది మంజు. పూర్తిగా పిచ్చివాడైపోయాడు రవి. "మంజూ!" అంటూ మంజుల కుడిచేతిని అందుకుని, తల వంచి సున్నితంగా, సుకుమారంగా ఉన్న ఆ చేతిని ముద్దుపెట్టుకోబోయాడు.

అంతలోనే మెట్లదగ్గరనించి వినిపించింది నాయనమ్మ కంఠం.

"రవిపండూ! చూశావుట్రా కనకదుర్గ కొండా!" అంటూ మెట్లెక్కి వస్తోంది. చివాల్న చెయ్యి వదిలి దూరంగా జరిగాడు రవి.

"కబాబ్ మే హడ్డీ!" అన్నాడు. నవ్వొచ్చింది మంజులకి. కానీ, నవ్వలేదు.

"ఏమిట్రా అంటున్నావు!" అడిగింది నాయనమ్మ.

"అబ్బే! ఏం లేదు, మామ్మా! మా మామ్మ చాలా మంచిది అని ఈ అమ్మాయితో చెప్తున్నాను" అన్నాడు రవి నాయనమ్మకు ఎదురు వెళ్తూ.

నవ్వాపుకుంటూ తమ్ముడికి ఈ వార్త చెప్పడానికి రివ్వున పరిగెట్టింది మంజుల.

*ఆంధ్రప్రభ, 11 సెప్టెంబర్ 1985*